# 'మాంబళం'

[కథానిక]

= శ్రీ 'కరుణకుమార' =

[ఏ వస్తువైనా నాదీ అని అనుకోవడంలోనే ఉంది ఆనందం. ఈ ఫౌంటన్ పేనా నాదీ, ఈ రిస్టువాచీ నాదీ, ఈ ఇల్లు నాదీ, ఈ దొడ్డి నాదీ, ఈ చెట్టు నాదీ, ఇది నాభార్య, వీళ్లు నాబిడ్డలు—ఆహా! ఎంత ఆనందం. ఒక వస్తువుకి తను ఖామందు, తను అధికారి అనేటప్పటికి మనిషి కెంత సంతోషం!]

*　　*　　*

౧

నిరుడు సంభవించిన యుద్ధభీతిఫలితంగా పట్నంవిడిచిపెట్టి లేచిపోయినవారిలో ఒకడు మేము కాపురంఉన్న ఇంటి ఖామందు. ఆయన పేరు కాంతయ్య.

క్రిందిభాగం మాకు ఇరవైఅయిదురూపాయలకు బాడుగకిచ్చి, ఆయన పైభాగంలో కాపురం ఉండేవాడు. పట్నంలో కొత్తగా పెరిగిన పేటల్లో ఒకటే మేముండే పేట. మోజుపడి స్వయంగా కట్టించుకొన్న లోగిలేమో—దక్షిణంవాకిలీ, వసారా, ఓచిన్న కాంపౌండూ, వెనకప్రక్క ఓ చిన్న దొడ్డీ—పెట్టెలా అమర్చిన ట్లుంటుంది ఆఇల్లు. ఇంటి ముందర ఆర్చి కట్టించి సన్నజాజుల మొక్కలే కాక కాశీరత్నాలూ, క్రింసన్ భోగం విలాసక్రీపర్లూకూడా అల్లించుకొన్నాడు కాంతయ్య. ఎడమపార్శ్వంలో ఓ కొబ్బరి పిలకా, పారిజాతం మొక్కా, ఎర్రగన్నేరు చెట్టూ, గులాబీ అంటూ, ఎర్రకనకాంబరాలూ, వెనకదొడ్డిలో దొండపాదూ, అరటి పిలకలూ, టొమాటో మొక్కలు మొదలయిన కాయకూరలచెట్లూకూడా పెట్టించి, ఇంటిముందు కాంపౌండులో దక్షిణభాగంలో ఓ మామిడిచెట్టు నాటించుకొన్నాడా ఖామందు.

మే మాఇంట్లో చేరేటప్పుడు మాకూ, ఆయనగారికీ జరిగిన ఏర్పాట్లల్లో ప్రధానమైన ఏర్పాటేమిటంటే—మాకు ఇంట్లో కాపురం ఉండడానికీ, నెలనెలా ఠంగున ఇరవైఅయిదు రూపాయలూ బిళ్లకుడుముల్లాగా చెల్లించుకోడానికీతప్ప, ఆ ఆవరణలో బయల్దేరే నిధినిక్షేపాలకుగాని, పుష్పఫలవృక్షాదుల ఫలసాయానికిగాని ఏలాటి హక్కుభుక్తాలూ ఏర్పడడానికి వీల్లేదని షరత్తు. ఓ పువ్వుగాని, ఓఆకుగాని మే మెవ్వరం అట్లా అంటుకోడానికి హక్కులేదు. ఓ అరటిచెట్టువైపు అట్లా కన్నెత్తిచూడకూడదు. ఓ దొండకాయని అట్లా స్మరించగూడదు. టొమాటో వంకాయని చూచి నోరూరకూడదు. ఆఖరుకి పథ్యం మెతుకుల్లోకి నూరే కారంపొడి

లోకి కరివేపాకురొబ్బలు కావలసివచ్చినా, ఖామందుఅనుమతి లేకుండా చెట్టుమీద చెయ్యి వేయకూడదని చండశాసనం.

తన సొత్తు కాబట్టి ఆయనగారి కటువంటి అధికారాలు చెలాయించుకొనేటందుకు వీలూ ఉన్నది. ఒకరకంగా అవసరం కూడా ఉన్నదేమో! తెల్లవారనివ్వడు—దోకుడుపారా, శలగపారా పుచ్చుకొని స్వయంగా చెట్టుచెట్టుకీ, మొక్కమొక్కకీ పాదులుచేస్తాడు, ఎరువువేస్తాడు, కాలవలు కట్టుతాడు, నీళ్లుపోస్తాడు, పందిళ్లువేస్తాడు; బిడ్డల్ని సాకినట్లు సాకుతున్నాడు ఆ అచర భూతనంతానాన్ని. అంత కష్టపడి పెంచుకొన్న వృక్షాల ఫలసాయం తానుగాక మరొకరనుభవించడాని కెట్లా వీలూ?

ఆయనగారు ఏకరువుపెట్టిన షరతుల కన్నింటికీ ఒప్పుకొన్నాం మేము. అరటిగెల వేస్తే ఆయనే కొట్టుకొన్నాడు. బొప్పాయి పళ్లు పండితే ఆయనే కోసుకొన్నాడు. దొండకాయలు కాస్తే ఆయనే రాల్చుకొన్నాడు. మునగకాయ లన్నీ ఆయనే విరుచుకొన్నాడు. వాటి నన్నిటినీ కాలకూటవిషంలా చూచుకొన్నాం మే మిా రెండేళ్లుగానూను.

అట్లాంటి దీయేడు ఏమైందంటే, మాయదారియుద్ధం ఆయనగారి ప్రాణానికే వచ్చినట్టయింది. ఇదిగో తోక అంటే అదే పులి అనే వరస ఎక్కడ పట్టినా! జపానువాడు వస్తున్నా డనీ, బాంబులు వేస్తున్నా డనీ, ప్రజలు హాత మైపోతున్నారనీ — అబ్బా! తలుచుకొంటే భీతావహంగా ఉంటుంది. పాపం పుణ్యం ఎరగని ప్రజమీదకూడా వేస్తాడట బాంబులు దుర్మార్గుడు! స్కూళ్లమీదా, చర్చీలమీదా కూడా వేసి నాశనం చేస్తాడట! ఈ రాక్షసుడు మన ఇల్లు విడిచిపెట్టుతాడా? మనం మోజుపడి కట్టించుకొన్న ఇల్లు, మనసుపడి పెంచుకొన్న చెట్లు—ఎద్దుపుండు కాకికి ముద్దా? ఈఇంట్లోనే కాదు - అసలు పట్నంపొలిమేరలో ఉండడమే గండమనిపించింది ఆయనగారికి. దానికితోడు, వాళ్ల వూరు వెళ్లిపోదామని భార్యకూడా ఒత్తిడిచేసింది - బ్రతికి ఉంటే బలుసు తినవచ్చునని. ఇంట్లో సామాను పట్నంలోనే మరొకరి ఇంట్లో వేసుకొని ఎవరయినా బాడుగకు వచ్చినట్టయితే పైభాగం ఇరవైఅయిదు రూపాయలకు బాడుగకు ఇవ్వవలసిందని తాళంచెవులు మాఇంట్లో యిచ్చి ఆయన కుటుంబసహితంగా నెల్లూరు వెళ్లిపోయాడు.

వాళ్లా ఇంట్లోఅడుగు అట్లా బయట పెట్టేసరికి, ఇట్లా ఇంటికంతకీ ఏకచ్ఛత్రాధిపత్యం పట్టాభిషేకం చేసుకొన్నారు - ఇంట్లో మా ఆవిడా, ఆవిడతమ్ముడూను. ఓ! ఇల్లూ, ఇంటి ఆవరణా, ఆవరణలో చెట్లూ, చెట్ల ఫలితం—సర్వమూ తమ ఏలుబడిలోనికి వచ్చినవి. ఎవరయినా అనువయినవాళ్లు వచ్చినట్టయితే పై భాగంలో చేర్పించవలసినదని ఆసంబంధ మయిన అధికారంకూడా వీళ్ల చేతుల్లోనే పెట్టి చక్కాపోయాడు కాంతయ్యగారు.

ఆక్షణంలగాయతు మాఆవిడా, మా బావమరదీ ఇంటి విషయమై తీసుకొన్న శ్రద్ధకూ, శ్రమకూ మితంలేదు. తెల్లవారడం తడవు, తీరిక గలిగిన ఘడియలు దొరికినపుడల్లా వాళ్లిద్దరూ చెట్లపాదుల్లోనే కాపుర

ముండేవారు. ఇంటి ఖామందుకంటెకూడా ఎక్కువ శ్రద్ధ తీసుకొని ప్రొద్దుటిపూటో, సాయంకాలంపూటో చెట్లకన్నిటికీ నీళ్లు పోస్తూ ఉండేవారు. క్రీపర్లో పూసిన జాజిమల్లెలే కాదు, కనకాంబరాలే గాదు, పారిజాతపుష్పాలే గాదు, గన్నేరులే గాదు-ఒక్క పూవు బయటికి పోకుండా వాళ్లే కోసుకొని ఉపయోగించుకొంటూ ఉండేవారు. ఇంటివాళ్లకు ప్రాప్తం లేకపోయిందిగాని-వాళ్లు వెళ్లిపోయినప్పటినుండీ-దాన్ని తగలబెట్టా, దొడ్లో దొండచెట్టు కరువో కాలమో అన్నట్టు చితకకాయడం మొదలుపెట్టింది. అదేమి వెర్రికాపో ఏరోజుపట్టినా తీగెలో చెయ్యి పెట్టేసరికి, వీశడుకాయలు పడ్డట్టు పడేవి ఒడిలో. తినితిని మాకు విసుగుపుట్టింది. విరగ్గానే ఆకాయలు తిని హరించుకోలేకా, కష్టపడి పండించుకొన్న కాయల్ని చేతులారా ఇరుగుపొరుగువారికి తిరిపెం ఇవ్వడానికి చేతులురాకా మాఆవిడా, మాబావమరదీ పడుతూవచ్చిన బాధ చెప్పితేతీరదు. దీనికితోడు సరిగ్గా ఆరోజుల్లోనే దొడ్లో అరటిచెట్లు రెండూ ఒక్కసారిగా చెరొక గెలా బయటవేసి, పదిహేను ఇరవైరోజుల్లోనే కాయలు ముదిరి, గెలలు బరువెక్కి, చెట్లు రెండూ ఓప్రక్కకి ఒరిగిపోయినవి. పైగా టొమాటో కాయలుకూడా వెట్టికి పండినట్టు తెగపండి ఊరుకుంటున్నవి. ఒక్కొక్క మునగకాయ బయల్దేరిందంటే - ఇట్లా ఇవేళ చూచిన వానపాములాంటికాడ నాలుగోనాటికల్లా ఇంతలావు పెరిగి, చూస్తే పొట్లకాయలాగా చెట్టుని వ్రేలాడుతూ ఉండేది. ఇన్ని కూరకాయల్ని తిని చెల్లించడం ఎట్లాగబ్బా! ఇంట్లో తినేవాళ్లుమాత్రం ఎవరున్నారు? నేనూ, మాఆవిడా, మాపిల్లవాడూ, మాబావమరదీ, వాడి భార్యాను. పదిపలాల దొండకాయలు పొయ్యిమీద పడేస్తే ఎక్కతిక్కలు. పాతకల్లాంటి రెండు అరటికాయలు తరిగి తిరగమోతలో వేస్తే మేం నలుగురం తినగా ఇంకోమనిషికి మిగులుతూఉండేవి కూరముక్కలు. ఒక్కమునగకాయ విరుచుకొని పులుసు కాచుకొంటే, రెండుపూటలా మేము త్రాగగా మిగిలిన పులుసు దాసిదానికి పడేస్తూఉండేది మాఆవిడ. పాపం! చెట్లు తీరా ఫలితానికి వచ్చేసరికి ఇంటిఖామందుకే తినడానికి రుణం లేకుండాపోయింది.

ఇట్లా ఉండగా, ఇంటివాళ్లు ఖాళీచేసి వెళ్లిపోయిన రెండునెలలకి పైభాగంలో ప్రవేశించడానికి ఒకరిద్దరు పెద్దమనుష్యులు వచ్చి ఇల్లు చూచి చక్కాపోయారు. పైభాగంలో వాళ్లకీ, క్రిందఉండేవాళ్లకీ ఏవిధమైన సంబంధం లేకపోయినా, ఇంట్లో మరోకాపురం ప్రవేశించిందంటే ఇప్పుడు ఉండే స్వేచ్ఛ ఉంటుందా! పైభాగంలో ఎవరూ కాపరానికి రావడం సుతరామూ ఇష్టముండేదికాదు మాఆవిడకీ, మాబావమరిదికీని. ఆదరిమిలానుకూడా ఎవరో ఒకరిద్దరు ఇల్లు చూడడానికి వస్తే పైభాగంలో నీళ్లు సరిగా రావనీ, పిల్లలు వరకంగా ఉండే మెట్లు దిగి ఎక్కడం ప్రమాదకరమనీ, క్రిందఉన్న విశాలం పైన ఉండదనీ - ఏవోవంకలుపెట్టి వచ్చినవాళ్లని వచ్చినట్టుగానే సాగనంపుతూవచ్చారు వాళ్లిద్దరూను. కాని ఎంతకాలమని ఈనాటకమాడగలరు వాళ్లు.ఒకరోజున కాంతయ్యగారి దగ్గరనుండి జాబు తీసుకొని ఓ పెద్దమనిషి అరవఆయన మాఇంటికి వచ్చాడు. ఆయన

కాంతయ్యగారికి తెలిసినవాడనీ, ఆయన్ని పైభాగంలో చేరనివ్వవలసిందనీ ఆజాబులో ఉన్నది. ఇక విధి లేక ఆయన పైభాగంలో చేరడానికి ఒప్పుకోవలసివచ్చింది మావాళ్లకి. పదిమందిబిడ్డలతోకూడా ఆయన వచ్చి పైన ప్రవేశించాడు. ఊరుకుంటే ముందుముందు ఆయన చెట్లఫలసాయంలో భాగానికి పేచీ పెట్టవచ్చునని దూరాలోచన చేసి మా ఆవిడా, మా బావమరిదీ ముందుగానే - పైన కాపురంఉండేవాళ్లు పైనే ఉండాలిగాని క్రింద ఆవరణలో గల చెట్లతోగాని, పూలతోగాని ఏవిధసంబంధమూ వాళ్లకి లేదనీ, తమ అనుమతి లేకుండా క్రింద చెట్టు అట్లా ముట్టుకోడాని కెవ్వరికీ అధికారంలేదనీ, పిల్లలు తెలిసో తెలియకో పువ్వుల్లో చేతులు పెట్టుతారేమో — అట్లాంటివి జరగకుండా అదమాయించుకోవలసిఉంటుందనీ - ఇట్లాంటివి, అసలు ఇంటిఖామందు పెట్టిన షరతులకంటెకూడా పదిషరతులు అదనంగానే సృష్టించి, ఆ వచ్చిన పెద్దమనిషి ముందరి కాళ్లకి ముందుగానే బంధంవేశారు. ఎంత మొండిఘటమో, ఆ వచ్చిన పెద్దమనిషి కిక్కురు మనకుండా గృహప్రవేశం అయాడు.

పైభాగం భర్తీఅయినా క్రిందఆవరణ మీదా, ఆవరణలోని చెట్ల సంతతిమీదా మావాళ్లకి సంక్రమించిన హక్కుభుక్తాలు అకుంఠితంగా కొనసాగుతూనే ఉన్నవి.

౨

ఇట్లా ఉండగా ఈఏడు ఏమైందంటే, ఇంటిముందు వసారాక్రింద దక్షిణమూలలోని మామిడిచెట్టు మాఘమాసం వచ్చే సరికే పచ్చంగా బంగారుపూసినట్లు విరగ పూసింది. వసారాలో మంచంవేసుకొని పండుకొంటే ఆపూతమీదనుంచి వచ్చే గాలి చల్లదనంతోపాటు కమ్మదనాన్ని కూడా ఎత్తుకొనివచ్చేది. ఆచెట్టుకి ఇదే మొదటిపూతో, లేక ఇదివర కెన్నడయినా పూసి కాసిందో మాకు తెలియదుగాని, మే మింట్లో ప్రవేశించినతర్వాతమాత్రం ఇంతవర కెన్నడూ ఆచెట్టు కాయలేదు. దానికీ యుక్తవయస్సు వచ్చిందో ఏమో, నూతనంగా పుష్పవతి అయి శోభనపుటారతిపళ్లెరాలను అందుకొనే పెళ్లికూతురులా శోభిల్లుతోంది ఆమామిడిచెట్టు. ఆకురాలుఋతువులో ముదురాకు రాల్చి వసంతోదయంతో చిగురాకు తొడిగి నవనవోన్మిషితమైన విలాస సంపదతో కన్నులపండువులా కన్పట్టుతోంది ఆ గున్న మామిడిచెట్టు — అంటుమామిడిచెట్టేమో. నలువైపులా పెరిగిన కొమ్మల వైశాల్యం చెట్టుపొడుగును మరుగుపరుస్తున్నది. చెట్టు మొదట్లో నీళ్లు పోయాలంటే మోగాళ్ల మీద గొంతుకూర్చుని కొమ్మలక్రింద నుంచి వెతుక్కొంటూపోవలసిందే. వసారా మెట్టుమీద నిలబడితే పూతలోని పుప్పొడి గాలికి మొహంఅంతా అలుముకొంటుంది.

పూతమీద ఉన్న చెట్టుకి ప్రతి నిత్యమూ తగినన్ని నీళ్లు పోసినట్టయితే, పూసిన పూత నిలిచి కాయవుతుందని ఎవరో చెప్పగా విని, దానికి పెద్ద పాదు చేసి, ప్రతి పూటా నాలుగేసి బిందెల నీళ్లు పోస్తూఉండేవాళ్లు మాఆవిడా, మాబావమరిదీనీ. కష్టే ఫలీ! పూత కొంత నష్టమైనా మిగిలినది పరిణామాన్ని పొంది క్రమంగా పిందెలోనికి దిగింది. అనాఘ్రాతపుష్పమైన కోమలాంగి వక్షోరుహాలను స్ఫురింపజేసే ఆ లేత

పిందెలు చూసేవాళ్ల కళ్ళవెంట నోరూరించి వేస్తున్నవి. కాలంతోపాటు ఈడుపోసుకొంటూ ఎదుగుతున్నాయి ఆ పిందెలు. లేత పరువం విడిచి తమ ఆకారాలు దిద్దుకొనే ఆ పిందెలను చూచినపుడల్లా, ఎదుటింటివారి ఎడపిల్ల మొలకి చుట్టిన మామిడిపిందెలపేరు నాకు స్ఫురణకు వస్తూండేది.

అంటుమామిడిచెట్టు అని అనుకోవడమేగాని, ఆచెట్టు ఏమి అంటో మా కింకా అవగతంకాలేదు. బెంగుళూరో, బంగినపల్లో, రసాలో, పీతరో - నిర్ధారణకాలేదు. కాని ఎంతకావాలి? ఒక్క వారం పదిరోజులు గడిచేసరికి, పిందె క్రింద రాలిన దోకటి పంటికింద పెట్టి కటిక్కన కొరికేసరికి - గుప్పుమని బంగినపల్లిసువాసన కొట్టి ఊరుకుంది. ఇక మాఆవిడసంతోషం చెప్పలేను! మా బావమరిది ఆనందం వర్ణించలేను!

పట్నంలో బంగినపల్లి మామిడా! ఏమిటీ! అయినా ఏమి గాలిపాటో, లేక లేచిపోయిన ఇంటిఖామందునోట్లో శనో, ఏమోగాని, అనుకోకుండా అట్లా పూసిందేం ఈ ఏడు! పూసిన పూత కాయగా మార్చేసుకొంది. ఈ మారిన కాపు మారినట్లుగా నిలిచిపోతే, గాలిదెబ్బకీ, వడతాకుడికీ రాలిపోయేవి పోగా ఎంత హీనంగా నిలిచినా రెండువందల కాయ నిలవగలదు. పరాయివాళ్ల చేతుల్లో పడకుండా కాపాడారీ చేసుకొంటే పక్వానికి వచ్చేసరికి నూరు నూటఏభయిపండువరకూ దక్కవచ్చును. పట్నంవచ్చి బంగినపల్లి పండు కోసం మొఖంవాచినట్టయిపోయింది.

కష్టపడనిది ఫలం దక్కుతుందా? కాబ్దారీ చేసుకోవలసిఉంటే చేసుకోవాలి. తప్పదు. పెరట్లో చెట్టుకాబట్టి కాబ్దారీ అంత కష్టం కానేకాదు. ఒకరు మార్చి మరొకరు చొప్పున ఇంట్లోవాళ్లే వసారాలో ఏ పుస్తకమో చేతపుచ్చుకొని కూర్చుంటే తీరేపోతుంది. మిద్దెమీద వాళ్ల పిల్లల్నీ, వాకిట్లోకి వచ్చే ముష్టి ముతకనీ కాస్త కనిపెట్టుకొగలిగితే రెండునెలలలోకి కాయ దింపేసుకోవచ్చును. అని ఈవిధంగా ఆలోచించుకొన్నారు మా ఆవిడా, మా బావమరిదీనీ.

దొడ్లో ఫలించే ఇతర కూరగాయల సంపద అంతా ఒక ఎత్తూ, ప్రత్యేకంగా మామిడమ్మ సంపద అంతా మరొక ఎత్తూ అయింది వాళ్లిద్దరికీనీ. దొండపాదు ఎండిపోయినా విచారం లేదనిపించింది. రాత్రిపూట దొంగలు దొడ్లో అరటిగెల కొట్టుకుపోతారన్నా దిగులులేదనిపించింది. టొమేటోచెట్లకి నీళ్లు లేకపోయినా ఫరవాలేదనిపించింది. కాశీరత్నాలు కాశీకిపోయినా మేలే అనిపించింది. ఇంట్లో ఎన్ని నిధినిక్షేపాలున్నా, కల్పవృక్షం, కామధేనువులాంటి ఒక్కబంగినపల్లిమామిడమ్మతో సమానమా!

కాయలు పెద్దవవుతున్నకొద్దీ పెరిగే బిడ్డని చూచిన ఆనందం కలగడం, వాటిని మరింత శ్రద్ధతో కాబ్దారీచేసుకోడానికి ప్రయత్నించడం సహజమే. గోడమీదనుంచి వీధిలోకి పడే కొమ్మలు మరుగుపడేటట్టు, చెట్టంత ఎత్తునా గోడమీద ఇనప ముళ్లతీగె చుట్టించింది మాఆవిడ. వరాండాలోనుంచి చటుక్కున ఎవరంటే వాళ్లు చెట్టుదరిమేనా నపోవడానికి వీల్లేకుండా చెట్టుచుట్టూ ముళ్లతీగకంచె కట్టించాడు మాబావమరిది. బయటనుండి ఏదుర్మార్గుడయినా రాయి రువ్వినా, కర్ర విసిరినా కాయరాలితే కంచెఆవరణలో

రాలవలసిందేగాని బయటవాడికిమాత్రం దక్కడానికి వీల్లేకుండా చేసుకొన్నారన్ని కట్టుదిట్టాలూను.

ఇన్ని కట్టుదిట్టాలు చేసుకొన్నా, ఇంతమంది కళ్లూ మరిపి, ఎవళ్లో, ఎప్పుడో చెట్టుమీద రాయి విసురుతున్నట్టే వాళ్లిద్దరికీ లోపల ఆందోళన. వాకిట్లోకి ఏపెద్ద మనిషి వచ్చినా మామిడికాయకోసరం వచ్చాడనే వాళ్ల భయం. చెట్టు నంటిపెట్టుకొని ఎవరో ఒకరు ప్రత్యేకంగా పారాయిస్తున్నప్పటికీ, బయట అలికిడి వినిపించినపుడల్లా "ఎవరక్కడ", "ఎవడువాడు", "పో", "అవతలికి పో" అని లోపల ఏ వంటఇంట్లో నుంచో మా బావమరిది వెర్రికేకలు పెట్టుతూఉండేవాడు. కర్రపుల్ల చేతిలోపట్టుకొని వీథిలో వచ్చే పోయే ప్రతీకుర్రవాడినీ వసారాలో నిలబడి, "చెట్టుదరికి రాండి. డొక్కచీలుస్తా" అని అరుస్తూఉండేవాడు. ముష్టివాడు వాకిట్లోకి తొంగిచూస్తే బూతులు తిట్టి బయటికి తరిమేవాడు. వీథినబడిపోయే ఓ రిక్షాబండివాడి కూతురు - పసిపిల్ల "మాంగాయ సామీ" అని అడిగితే, "నీకు మాంగాయ కావాలా? ఇస్తా, రా" అని లోపలికి పిలిచి రెండుదవడలూ వాయించి సాగనంపేవాడు. మిద్దెమీద పిల్లలు ఏబజారునుండి అయినా మామిడికాయలు తెచ్చుకొంటూ వాడికళ్లపడ్డారా-ఆ కాయల్నీ, తన చెట్టుకాయల్నీ పోల్చి సరిచూసుకొంటూఉండేవాడు. తన చెట్టుకి ఏయేకొమ్మని, ఎక్కడెక్కడ, ఎన్నెన్ని కాయలు, ఎట్లా ఉన్నాయో, ప్రతీకాయా లెక్కపెట్టుకొని గుర్తుపెట్టుకొంటూఉండేవాడు. ఏగాలిపాటుకయినా, ఏ వడదెబ్బకయినా పిందె క్రింద రాలిందంటే విలవిల్లాడిపోయేవారు ఆ అక్కా, తమ్ముడూను. దిష్టి తగులుతుందని, మట్టిపిడతకి సున్నం రాసి, బొట్లుపెట్టి వీథిలో అందరికీ అగుపడేటట్లు కర్రకి తగిలించారు.

వాళ్ల కష్టం, శ్రద్ధా, పోషణా, శ్రమా చూచేసరికి నాకు విచారమూ వేసేది, సంతోషమూ కలిగేది. పెంచేవాడొకడూ, అనుభవించేవాడొకడూను! సృష్టిలో కనిపించే వైచిత్ర్యమే ఇది. ఆపెద్దమనిషి మోజుపడి కట్టించుకొన్న ఇంట్లో కాపరంఉండడానికి నోచుకోలేకపోయాడుగదా! అదేమి శనివీక్షణమో - ఆయనగారు ఇంట్లో ఉన్నంతకాలమూ ఈమామిడమ్మ కాపుకాసినట్టే లేదు. ఆయనా అట్లా మొఖం తప్పించాడు. మావాళ్ల రేఖ బయటపడి చెట్టు విరగ్గాసి ఊరుకుంది.

పోనె - చైత్రం గడిచి వైశాఖం వచ్చేసింది. అదేమి కాపో, అదేమి పెంపో, నిన్నమొన్నటి కాయలు రెపరెపలాడుతూ ఎదిగి జీడిముదిరి ముట్టెకట్టినవి. వెలగకాయల పరిమాణం విడిచిపెట్టి, మారేడు కాయంత అయి, కండకట్టి పొతకళ్లాగ, అప్పుడే పట్టెడు పట్టెడు కాయ లయిపోయినవి. చిన్నతనం నేవళం విడిచి, కాయ బిరుసెక్కి బరువెక్కింది. లేతకొమ్మలు దోరకాయలబరువుకి నేలమీద పారాడిపోతున్నవి. అదివరకు ఆకుచాటుపిందెలన్నీ, మైనారిటీ వదిలిన జమీందారులలాగా, బయటపడి విర్రవీగుతున్నవి. చెట్టుకి ఆకులపస వైదొలగి పండ్ల వైభవం పిక్కటిల్లింది.

## 3

మంచిరోజు చూచి కాయ దింపడానికి ప్రయత్నా లారంభించారు మాఆవిడా, మా

బావమరిదీని. డబ్బిచ్చి బజారులో పళ్లు కొని తెచ్చుకొని తినడమేగాని పచ్చిమామిడికాయని కావేసి పండుచేయడ మెట్లాగో వాళ్లకు తెలియులేదు. బుట్టకట్టి గదిలో తాళంవేసి పెట్టాలో, లేక పీపాలో వేసి బంధిస్తే పక్వానికే వస్తాయో, లేక ఎండుగడ్డి కాపుకే ముగ్గుతాయో - ఎన్నడయినా ఈఅగచాట్లు పడ్డ వాళ్లయితేగా! ఆతిరుగుళ్లు తెలియక ముగ్గవేయడంలో ఎగుడుదిగుడయితే, ఇంతా కష్టపడి దింపుకొన్న కాయ కుళ్లేపోతుందో, అసలు పండకుండా కాయ గిటకపారేపోతుందో, లేక పురుగేపట్టుతుందో-! వాళ్లకి భయం పుట్టింది. మాగవేయడం ఎట్లా అని నన్ను సలహా అడిగారు. చెట్టు కాయల్ని చూస్తే నాకూ కన్నుకుట్టింది. భద్రంగా ఈకాయల్ని కాపాడుకొంటే, ఇక ఈసంవత్సరానికి దమ్మిడీకర్చుపెట్టి మామిడిపండు కొనవలసిన అవసరం లేదు. నా చిన్నతనంలో చెరువుగట్టున కాచే కోతిపిర్ర మామిడికాయల్ని మా నాన్న తాటాకుబుట్టల్లో పట్టించి దొడ్లో వడ్లగాదిలో మాగవేయడం నాకు జ్ఞాపకం. ఎండుగడ్డి ఉడుకు తగిలితేనే గాని పండు పక్వానికి తిరగదని ఎవరో చెప్పగా విన్నట్టు నాకు గుర్తు. నా అనుభవం వాళ్లతో చెప్పాను. కాని ఇక్కడ గాదు లేదే! గాలితగలని కొట్టే లేదు. రెండు వందల కాయలు కోస్తే ఓగది అంతా ఆవరించుకొనేలా గున్నవి కాయలు. మాఇల్లు అంత పెద్దదికూడా కాదు. ఇబ్బంది అయినా తప్పదు. నాలుగురోజులు జరుపుకొంటే ఆతర్వాత ఆసుఖమంతా మేమే అనుభవిస్తాం. తలుపులూ, కిటికీలూ బిగించి దక్షిణపుగది ఖాళీచేసి, అందులో కాయలు మాగవేయడానికి తీర్మానించుకొన్నారు మాఆవిడా, మాబావమరిదీని.

గదిలో గుడ్డల బీరువాలూ, బల్లా, పెట్టెలూ, పుస్తకాల అలమారూ అన్నీ తీసి ఇవతల హాలులో పెట్టించారు. బజారుకి వెళ్లి ఏభయి ఏభయి పళ్లు పట్టే ఈతబరికెబుట్టలు నాలుగు పెద్దబుట్టలు కొనితెచ్చి గదిలో పెట్టించాడు మాబావమరిది. వీథిలోకి అమ్మవచ్చే బళ్ల వాళ్లదగ్గర ఒకరూపాయిపట్టి రెండు ఎండు గడ్డివెంటులు కొని, వాటిని విప్పి నాలుగు బుట్టల్లోకీ సర్దించారు. చెట్టుదగ్గరికి వెళ్లి కాయలన్నిటినీ ఆఖరుసారి లెఖ్ఖపెట్టుకొన్నారు. రెండువందలకీ పరకో,పరకన్నరో తగ్గినట్టు ఉరామరికగా కనిపించాయి.

తెల్లవారితే శుద్ధపంచమీబుధవారం. దివ్యమైన రోజు. కాయ దింపడానికి నిశ్చయం చేసుకొన్నారు. దింపడంలో కాయ కింద పడకూడదు. దెబ్బతింటే కాయ డాగుపడుతుంది. అందువల్ల మాఆవిడా, మాబావమరిదీ స్వయంగా ఒక్కొక్కకాయే దింపవలసిందీ, వాటిని బహుజాగ్రత్తగా గాజుబొమ్మని తీసుకొనిపోయినట్లు గదిలోకి మా పిల్లవాడూ,మాబావమరదిభార్యా తీసుకొనిపోవలసిందీని.

## ౪

తెల్లవారి లేచి పెందలాడే వంటచేసింది మాఆవిడ. నేను పదిగంటలకే భోజనం చేసి ఆఫీసుకి వెళ్లిపోయాను.

సాయంత్రం ౭ గంటలకి నేను తిరిగి ఇంటికివచ్చి వసారాలో అడుగుపెట్టి మామిడిచెట్టువైపు చూచేవరకు, శోభ అంతా తరిగి వెలవెల్లాడుతోంది చెట్టు. చెట్టుకింద ఆకులూ,

రొబ్బలూ పడి అంతా బీభత్సంగా ఉన్నది ఆవరణ. చెట్టుని ఒక్క కాయకూడా మిగల్చకుండా దింపేశారు మావాళ్లనుకొంటూ నేనూ ఇంట్లో అడుగుపెట్టేసరికి పడకకుర్చీలో దిగాలుపడి కూర్చున్నారు మా బావమరిది. గచ్చుమీద కొంగు పరుచుకొని కళ్లవెంబడి నీళ్లు గ్రుక్కుకొంటోంది మా ఆవిడ.

"అట్లా పడుకున్నావేం?" అని అడిగాను ఆవిడను.

"రెండు నెలలు చేతులు పుల్లెక్కేట్టు, చాకిరీ చేసి పెంచుకొన్నాను కాయల్ని"

"ఏం కాయలు?"

"బంగినిపల్లి కాయలు. పట్నంలో కరువుగదా, మనం ఇన్ని తిని మిగిలినవి మా వాళ్లకు గుంటూరుకికూడా పంపించుకొందామని ఉబలాటపడ్డాను."

"ఏమైనాయి కాయలు?"

"మీరూ అన్నంతిని అట్లా ఆఫీసుకి వెళ్లారూ! ఆయనా రైలుదిగి ఇట్లా తయారయాడు."

"ఎవరు?"

"శనిముండాకొడుకు - కాంతయ్యగారు."

"వచ్చి-?"

"మేము అడ్డంవెళ్లినా దబాయించి పారేసి ఇద్దరు కూలీలని పిలిపించి చెట్టు కాయల్ని దులుపుకొని చక్కాబోయాడు"

"చెట్టుకాయలసంగతి ఆయన కెట్లా తెలిసింది?"

"మిద్దెమీద పెద్దమనిషి జాబు వ్రాసి ఉంటాడు."

"ఆయన కేం కాబట్టింది?"

"కడుపులో మంట. దొడ్లో కూరగాయలన్నీ మనమే తింటున్నామని అసలే కళ్లు మండిపోతున్నాయి వాళ్లకి. మొన్న అరవ సంవత్సరాదికి గుమ్మానికి తోరణం కట్టుకోను మామిడాకులు కోసుకొంటానని ఆయనడిగితే, వల్లకాదన్నాడు మాతమ్ముడు. దానికి ఇదే శాస్తి అనుకొన్నాడు."

"అట్లాగా?" అని ముక్కుమీద వేలేసుకొన్నాను నేను.

